క్లుప్తంగా

ఉచిత వేసవి శిక్షణ శిబిరం

మోపాల్/నిజామాబాద్ రూరల్: మోపాల్ జెడ్పీహెచ్ఎస్, గూపన్‌పల్లి ఉన్నత పాఠశాలలో ఈ నెల 10 నుంచి 24 వరకు విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారులలు గేమ్ సింగ్, సేవు లాలు వేర్వేరుగా బుధవారం తెలిపారు. యోగా, సెల్ఫ్ డిఫెన్స్, డ్రాయింగ్, డ్యాన్సింగ్, పాటలు, కంప్యూటర్, తదితర విషయాల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో పిల్లలకు స్నాక్స్ ఇస్తామని పేర్కొన్నారు. ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో కోరారు.

సిర్పూర్‌లో వైద్యశిబిరం


ప్రజలను పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

మోపాల్: మండలంలోని సిర్పూర్‌లో శ్రీ గురు రాఘవేంద్ర సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా బీపీ, షుగర్, తదితర పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తగు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ వాజీ తెలిపారు. శ్రీనివాస్, శశికళ, టోని, తదితరులు పాల్గొన్నారు.

భూవివాదంపై అధికారుల విచారణ


వివరాలు సేకరిస్తున్న రెవెన్యూ అధికారులు

డిచ్‌పల్లి: దూస్‌గాం శివారులో గ్రామ దేవతలకు సంబంధించిన స్థలాన్ని ఒకరు కబ్జా చేయడానికి యత్నించడంతో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం ఆర్ఐ సంతోష్, సర్వేయర్ సూర్యప్రకాష్, పోలీసులు వివాదాస్పద స్థలం వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు. 30 ఏళ్లుగా ఈ స్థలాన్ని గ్రామ దేవత కోసం వినియోగిస్తున్నామని గ్రామపెద్దలు అధికారులకు తెలియజేశారు. ఇటీవల స్థలాన్ని చదును చేసిన వ్యక్తి అందుబాటులో లేకపోవడంతో అధికారులు ఆయనకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ స్థలం పట్టా భూమి అని గ్రామానికి చెందిన స్థలం కాదని అతడు పేర్కొన్నట్లు అధికారులు తెలిపారు. వివాదాస్పద స్థలం కోర్టు పరిధిలో ఉన్నందున రికార్డులను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

భారత సైన్యానికి పూర్తి మద్దతు


మద్దతు తెలుపుతున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల సంఘం ప్రతినిధులు

డిచ్‌పల్లి: 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పహల్గాం దుర్ఘటనకు పాకిస్తాన్‌పై ప్రతీకారం తీర్చుకున్న కేంద్ర ప్రభుత్వం, భారత సైన్యానికి తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం(టీయూపీసీఎంఏ) పూర్తి మద్దతు తెలిపింది. బుధవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఎస్‌పీఆర్ డిగ్రీ కళాశాల వద్ద పహల్గాం మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, సంజీవ్‌లు మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ పేరుతో భారతదేశ సైన్యం మెరుపుదాడి చేసి ఉగ్రవాదులను మట్టుపెట్టడం హర్షణీయమన్నారు. భవిష్యత్‌లో భారతదేశం వైపు చూడాలంటే ఉగ్రవాదులు భయపడిపోవాలన్నారు. టీయూపీసీఎంఏ సభ్యులు నరాల సుధాకర్, అరుణ్, గురువేందర్, దత్తు, నవీన్, శ్రీనివాస్, రాజు, అతీఖ్, విజయ్, గంగాధర్, నరేందర్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైన్యానికి అండగా ఉండాలి..

నిజామాబాద్ రూరల్: భారత సైన్యానికి అండగా ఉండాలని జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం దేశ ప్రజలు, రాజకీయ నాయకులు పార్టీలకు అతీతంగా దేశం కోసం ఆలోచించాలని.. అనవసర రాజకీయాలు చేయవద్దన్నారు.

బాధితులకు పరామర్శ



సిరికొండ: ముషీర్‌నగర్ గ్రామంలో ఇటీవల వ్యాను కిందపడి మృతి చెందిన మలావత్ జగదీష్ కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నేత, ధర్పల్లి మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ బుధవారం పరామర్శించారు. రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అధైర్యపడవద్దని అన్ని విధాలుగా అండగా ఉంటామని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ భూషణ్ రెడ్డి రాజు తదితరులున్నారు.


డిచ్‌పల్లి: మాట్లాడుతున్న యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సీఐ శ్రీనివాస్


కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

సాక్షి నెట్‌వర్క్: గంజాయి, కల్తీ కల్లు వంటి మత్తు పదార్థాలకు బానిస కావొద్దని నార్కోటిక్స్ బ్యూరో పోలీసు ఉన్నతాధికారులు సూచించారు. బుధవారం పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు రూరల్ నియోజకవర్గం పరిధిలో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. చేయి చేయి కలుపుదాం..డ్రగ్స్ రహిత తెలంగాణను సాధిద్దాం అంటూ ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసు ఉన్నతాధికారులు మాట్లాడుతూ.. పిల్లలు పక్కదారి పట్టకుండా తల్లిదండ్రులు ఎప్పుడూ గమనిస్తుండాలన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటు పడితే 1908, 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. మాదకద్రవ్యాలు విక్రయించిన వారికి, వాటిని ప్రోత్సహించిన వారికి ఏడేళ్ల జైలు శిక్ష పడుతుందన్నారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. మహిళా సంఘాల సభ్యులు, ఆశావర్కర్లు, వైద్య , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


గడ్కోల్‌లో మానవహారం ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్న పోలీసులు


గుండారంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఏసీపీ శ్యాంసుందర్, వైద్యసిబ్బంది తదితరులు


ధర్పల్లి: అవగాహన కల్పిస్తున్న యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులు


నల్లవెల్లిలో ..

తైబజార్ వేలం ఎప్పుడో..?

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- టెండర్ల కోసం ఆశావహుల ఎదురుచూపులు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహించాల్సిన తైబజార్, జంతువధ వేలం నిర్వహించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం మార్చి నెలలోపు ఈ టెండర్లు నిర్వహిస్తారు. బహిరంగ వేలం కోసం ప్రకటనలు ఇస్తారు. వేలం కోసం సమాచారం ఇస్తారు. కానీ ఈ సారి మాత్రం అటువంటి సూచనలు కనపడటం లేదు. జంతువధ కోసం మాత్రం మార్చి నెలలో అప్పటి డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ పర్యవేక్షణలో వేలం నిర్వహించారు. ఇందులో అత్యధికంగా వేలం పాడి రూ.25 లక్షల 66 వేలు పాడి ఇమ్రాన్ ఖురేషీ అనే వ్యక్తి వేలం దక్కించుకున్నారు.

అయితే తైబజార్‌కు, మేకల వధ కోసం మాత్రం టెండర్లు ప్రారంభించలేదు. గడువు పూర్తయి నెల రోజులకు పైగా అయినా ఇప్పటివరకు రెవెన్యూ అధికారులు టెండర్లు పిలవడం లేదు. దాంతో పాత నిర్వాహకులతో రెవెన్యూ అధికారులు కుమ్మక్కయ్యారని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ప్రతిసారి తైబజార్, మేకల వధకు సిండికేట్‌గా మారి బల్దియా ఆదాయానికి గండికొండుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరికి రెవెన్యూ విభాగంలోని కొందరు ముఖ్యులు సహకరిస్తూ టెండర్లు నిర్వహించడం లేదని కొందరు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ వేలం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జిల్లా ప్రతినిధులకు బీఐఎస్ సర్టిఫికెట్లు


సర్టిఫికెట్ అందుకుంటున్న సందు ప్రవీణ్

సుభాష్‌నగర్: ఢిల్లీలో రెండ్రోజుల పాటు జరిగిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ శిక్షణా తరగతులకు జిల్లా నుంచి హాజరైన వినియోగదారుల రాష్ట్ర ప్రతినిధులు సందు ప్రవీణ్, పెండోట అనిల్‌కుమార్‌కు బీఐఎస్ అధికారులు సూర్యకళ్యాణి, శిఖా రాణా, భారత వినియోగదారుల సమాఖ్య చైర్మన్ అనంత శర్మ బుధవారం సర్టిఫికెట్లు అందజేశారు. వస్తు సేవల నాణ్యత, బంగారు వెండి ఆభరణాలపై హాల్ మార్కింగ్ విధానం, వినియోగదారుల సంఘాలు నిర్వహించే ఫిర్యాదుల పరిష్కారం, వినియోగదారుల కమిషన్ (వినియోగదారుల కోర్టు)ల ప్రాధాన్యత తదితర అంశాలపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాలు వినియోగదారుల హక్కుల పరిరక్షణకు తోడ్పడతాయని భారత వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సందు ప్రవీణ్ తెలిపారు. త్వరలో భారత వినియోగదారుల సమాఖ్య ఆధ్వర్యంలో ఆహార కల్తీపై శిక్షణా తరగతులు నిజామాబాద్‌లో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వైభవంగా కన్యకాపరమేశ్వరి జయంత్యోత్సవాలు


డోలారోహణం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దంపతులు


తాళ్లరామడుగులో పూజలు చేస్తున్న ఆర్య వైశ్యులు

సుభాష్‌నగర్: నగరంలోని కిసాన్‌గంజ్ ఆర్యవైశ్య పట్టణ సంఘంలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంత్యోత్సవాలు బుధవారం వైభవోపేతంగా నిర్వహించారు. వేడుకలకు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కుటుంబ సమేతంగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నామకరణ, డోలారోహణం నిర్వహించి ఎమ్మెల్యే అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. కన్యకాపరమేశ్వరి మాతా జయంత్యోత్సవాలు ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించడం హైందవ జాతి జీవన విధానం, సనాతన హిందూ ధర్మాన్ని రక్షించడమే అవుతుందని అన్నారు.

తాళ్లరామడుగులో..

సిరికొండ: తాళ్లరామడుగు రామాలయం వద్ద ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి కన్యకాపరమేశ్వరి మాత జయంతి నిర్వహించారు. వాసవీ మాత చిత్రపటానికి పూజలు చేశారు.

యువ వికాసం సర్వే వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న రాజీవ్ యువ వికాసం సర్వేను త్వరగా పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ సూచించారు. బుధవారం బల్దియా కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, విభాగాల అధిపతులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు 13 వేల దరఖాస్తులు వచ్చాయని, 50 శాతం సర్వే పూర్తి చేశారని, మిగతావి త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు.

భూభారతి దేశానికే రోల్ మోడల్


వివరాలు తెలుసుకుంటున్న ఈరవత్రి అనిల్

బాల్కొండ: తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని టీఎస్ఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. బుధవారం మెండోరా మండలం వెల్కటూర్‌లో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. రైతుల నుంచి వస్తున్న దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యలను సత్వరమే పరిష్కరించడం కోసం భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ధరణితో రైతులను దగా చేశారని మండిపడ్డారు. ఆర్డీవో రాజు గౌడ్, కొత్తింటి ముత్యంరెడ్డి, తదితరులున్నారు.

మాల మహానాడు జిల్లా కమిటీకి అభినందనలు


అభినందనలు తెలుపుతున్న గడుగు గంగాధర్

నిజామాబాద్‌నాగారం: నూతనంగా ఎన్నికైన మాల మహానాడు కమిటీ జిల్లా అధ్యక్షుడు చొక్కం దేవీదాస్, కార్యవర్గ సభ్యులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ బుధవారం ప్రత్యేకంగా తన నివాసంలో అభినందించారు. శాలువా, పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కమిటీకి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. జిల్లా కార్యదర్శి నాంది వినయ్ కుమార్, ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ అలుక కిషన్, రాష్ట్ర మాల మహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, జిల్లా కోశాధికారి ఎ.రాజన్న, తదితరులు ఉన్నారు.

ఉద్యోగ కల్పనలో ముందున్నాం

నిజామాబాద్ అర్బన్: గిరిరాజు కళాశాల ఉద్యోగాల కల్పనలో ముందుందని కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం కళాశాలలో ఉద్యోగమేళా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌సీఎల్, టెక్-బీ సంస్థలు మేళాలో పాల్గొన్నాయని, 15 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని తెలిపారు.

సమ్మెను విజయవంతం చేయాలి

నిజామాబాద్ సిటీ: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ కోరారు. సమ్మెకు సంబంధించిన పోస్టర్‌లను బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో విడుదల చేశారు. నాయకులు శంకర్ గౌడ్, సింగిరెడ్డి చంద్రారెడ్డి, నరేష్, గంగాధర్, ప్రభాకర్, మురళి, థామస్, మహేష్ పాల్గొన్నారు.

అందాల పోటీలు రద్దు చేయాలి

నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అందాల పోటీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మహిళా సంఘాలు, వామపక్ష పార్టీలు, పీడీఎస్‌యూ నాయకులు ఆందోళన నిర్వహించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. మహిళల ఆత్మగౌరవాన్ని భంగపరిచేలా నిర్వహించే అందాల పోటీలు రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. నాయకులు అరుణ, భారతి, లక్ష్మి, సుజాత, వనిత, రాజు, సంతోష్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు



నిజామాబాద్‌నాగారం: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. బుధవారం నగరంలోని బస్వా గార్డెన్‌లో అమెచ్యూర్ తైక్వాండో స్టూడియో ఓపెనింగ్ ప్రారంభోత్సవానికి అతిథిగా ఆయన హాజరై ప్రారంభించారు. సీపీ మాట్లాడుతూ.. పిల్లలకు చదువుతోపాటు క్రీడలు చాలా అవసరమన్నారు. తైక్వాండో లాంటి క్రీడలు నేర్చుకోవడం ద్వారా మానసికంగా శారీకంగా ధృఢంగా ఉంటారన్నారు. తైక్వాండో శిక్షణ ఎలా ఉందో ప్రత్యేకంగా సాధన చేసి పిల్లలకు చూపించారు. అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి మనోజ్, టైక్వాండో చైర్మన్ బస్వా లక్ష్మీ నరసయ్య, ప్రెసిడెంట్ బాజిరెడ్డి జగన్, వైస్ ప్రెసిడెంట్ జి.రవీంద్ర గుప్తా ,డాక్టర్లు విశాల్, ప్రతిమరాజ్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగోడి తెగువను చాటిచెప్పిన వీరుడు అల్లూరి

ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ


అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

సుభాష్‌నగర్: తెలుగు జాతి పౌరుషాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా గురువారం నగరంలోని కోటగల్లిలోగల ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. భారత స్వాతంత్య్ర సంగ్రామంలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని, ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్య్ర పోరాటంలో ఒక ప్రత్యేక అధ్యాయానికి నాంది పలికిందన్నారు. మన్యం ప్రజల మాన, ప్రాణ రక్షణకు తెల్ల దొరలను ఎదురించారని, గిరిజన జాతిని ఏకం చేసి విప్లవ చైతన్యాన్ని రగిలించి, గెరిల్లా యుద్ధ నైపుణ్యాలను నేర్పించి, బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన వీరుడని కొనియాడారు. ఆ మహావీరుడు గిరిజన జాతికే కాదు.. యావత్ భారతదేశానికి ఆదర్శ ప్రాయుడన్నారు. బీజేపీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు బంటు రాము, నాగరాజు, ఇప్పకాయల కిషోర్, అంతిరెడ్డి హరీష్ రెడ్డి, చింతకాయల రాజేందర్, డి.సుదర్శన్‌రావు, విమలారాణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లూరి పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి



నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ, పీవైఎల్ నేతలు


గడ్కోల్‌లో.. మాస్‌లైన్ శ్రేణులు

నిజామాబాద్‌అర్బన్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, పీవైఎల్ జిల్లా అధ్యక్షులు వనమాల సత్యం అన్నారు. బుధవారం అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా పీడీఎస్‌యూ, పీవైఎల్, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలో మార్కండేయ మందిరం వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు శివకుమార్, రమేష్, మనోజ్, నిఖిల్, భాస్కర్, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

గడ్కోల్‌లో..

సిరికొండ: గడ్కోల్ గ్రామంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని బుధవారం నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి సీపీఐఎంఎల్ మాస్‌లైన్, న్యూడెమోక్రసీ నాయకులు పూలమాలలు వేసి వేర్వేరుగా నివాళులర్పించారు.

ఏబీవీపీ విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందిస్తుంది


మాట్లాడుతున్న ఏబీవీపీ నేత రెంజర్ల నరేశ్

నిజామాబాద్ అర్బన్: ఏబీవీపీ ప్రపంచంలోనే అతి పెద్ద విద్యార్థి సంస్థ అని, విద్యార్థుల్లో దేశభక్తి జాతీయ భావాలు పెంపొందిస్తుందని ఏబీవీపీ హిందూ విభాగ్ ప్రముఖ్ రెంజర్ల నరేశ్ అన్నారు. బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ ఉచిత బోధన శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏబీవీపీ ఎంతోమంది దేశభక్తులకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ప్రతి ఏటా ఏబీవీపీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ ఉచిత బోధన తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఏబీవీపీ ఇలాంటి నిర్మాణాత్మక కార్యక్రమాలు చేస్తూ ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తుందన్నారు. మహనీయుల జయంతులు, వర్ధంతులు నిర్వహిస్తూ విద్యార్థులలో దేశభక్తిని నింపుతుందన్నారు. 42 మంది ఏబీవీపీ కార్యకర్తలు దేశం కోసం ప్రాణ త్యాగాలు చేశారని గుర్తు చేశారు. ఏబీవీపీ విభాగ్ సంఘటన మంత్రి రాజు సాగర్,కన్వీనర్ ఫైర్ శశిధర్, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అమత్ చారి, నేతలు వెంకటకృష్ణ, వంజరి బాలకృష్ణ, దుర్గాదాస్, సాయి రంజిత్ తదితరులు పాల్గొన్నారు .

హైమాస్ట్ లైట్లు ప్రారంభం


లైట్లను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ నల్ల సారిక

ధర్పల్లి: మండల కేంద్రంలో హైమాస్ట్ లైట్లను మాజీ ఎంపీపీ నల్ల సారికారెడ్డి బుధవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్సీ కవిత సీడీపీ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయడంతో రూ.6 లక్షలతో 4 హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసినట్లు, మరో రూ.4 లక్షలతో వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు మాజీ ఎంపీపీ పేర్కొన్నారు. తమ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నా ప్రజాసేవకు కృషి చేస్తుందని మాజీ ఎంపీపీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవితకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	హిట్-10.30, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-2	థండర్‌బోల్ట్స్(ఇంగ్లీష్)-11.00, 4.40
	రెట్రో-1.30, 7.20, 10.30
స్క్రీన్-3	రైడ్-2(హిందీ)-11.00,1.40,4.30, 10.30
	థండర్‌బోల్ట్స్(ఇంగ్లీష్)-7.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	హిట్-9.50, 1.05, 4.20, 7.35, 10.50
స్క్రీన్-2	రెట్రో-10.10, 4.25, 10.40
	థండర్ బోల్ట్స్(3డీ)-1.35, 7.50
స్క్రీన్-3	రైడ్-2(హిందీ)-10.00, 4.25, 10.50
	రెట్రో-1.00, 7.25
స్క్రీన్ -4	తుడరుమ్-10.15, 1.35
	సారంగపాణి జాతకం-4.55
	రైడ్-2(హిందీ)-7.45 - జింఖానా-10.45

లలితామహల్ రెట్రో — దేవి థండర్ బోల్ట్స్ 2డీ
నటరాజ్ రైడ్-2(హిందీ) — విజయ్ హిట్

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	99,400	వెండి(కిలో)	1,01,500
22 క్యారెట్స్	91,760	- నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	190
		లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	12	గాజరుగడ్డ	30	60
బెండకాయ	40	50	పచ్చిమిర్చి	35	50
బీరకాయ	40	80	దోసకాయ	20	40
దొండకాయ	35	60	ఆలుగడ్డ	25	50
బీర్నీసుకాయ	80	120	గోబిగడ్డ	8	16
కాకరకాయ	35	60	గోబిపువ్వు	25	50
వంకాయ	20	40	బీట్‌రూట్	25	50
పాలకూర	20	40	కరివేపాకు	50	80
మెంతికూర	70	100	చామగడ్డ	60	80
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	40	80	మామిడికాయ	50	70

-సుభాష్‌నగర్